67

# బొమ్మల పెళ్ళిళ్ళు

## 1

ఆ రోజు సరోజినికి పర్వదినం. ఆ పిల్ల కళ్ళకు సమస్తం ఆనందమయంగా తోచింది. వాళ్ళబావ భైరవమూర్తిగారి మేడ టాజిమహల్లా గుంది. ఇంటిపక్కతోట నందనవనంలాగుంది. తనతో తోటలో షికారు చెయ్యటానికి వచ్చిన సావిత్రి సాక్షాత్తూ దేవకన్యలాగుంది. ఆ రోజున సరోజినికి సావిత్రిని చూస్తే అనురాగం పొంగి పొర్లటం మొదలు పెట్టింది. ఈ ప్రేమావేశం తాత్కాలికమే ననీ. పూర్వం వున్నది కాదనీ, ముందుండబోదనీ ఆ ఉత్సాహం మీద సరోజినికి తోచటం అసంభవం. దీనికంతా కారణం అప్పుడే ప్రవేశిస్తున్న వసంతరుతువు కాదు, ఆ నాడు భైరవమూర్తిగారి శిశువు అన్నప్రాశన.

మీరు సావిత్రిని కాని సరోజినిని కాని బాగా ఎరిగుండకపోతే ఇద్దరూ కవల పిల్లలని చెప్పినా నమ్ముతారు. నిజానికి మటుకు సరోజిని సావిత్రికి పినతల్లి. సావిత్రి - సరోజిని

కన్న ఏ మాత్రమో పెద్దదీ, సరోజినికన్న మిత భాషికూడా కావటం చేత చూడగానే ఇద్దరిలో కనబడే భేదమేమిటంటే సావిత్రి పినతల్లికంటె గంభీరంగా వుండేది.అంతకుమించి ఇద్దరిలోనూ ఎక్కువ తారతమ్యం లేదు

సరోజిని సావిత్రిని తోటంతా తిప్పి ఆఖరుకు తన ప్రాణానికి మంచి పొదరిల్లంటిది కనబడ్డచోటు చూపి ఇక్కడ కాస్సేపు కూర్చుందామన్నది. ఇద్దరూ ఆకుల కింద కూర్చున్నారు. కొంతసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి సరోజిని అసలు సంగతి కొచ్చింది.

"అయితే, సావిత్రీ. బావ నీ పెళ్ళి చేస్తాడుట నిజమేనా ?"

సావిత్రి సమాధానంగా పినతల్లిని నవ్వించింది.

"అంతా నిశ్చయ మయిందా?"

"అదే నిశ్చయం. యింకా తాంబూలా లిచ్చుకో లేదు."

"నీ కాబోయే మొగుడెవరే?"

సావిత్రి చాలా నేర్పరి. ఎటువంటి ప్రశ్న కటువంటి సమాధానం.

"ఎరగవుటే? మామయ్య ఇక్కడ చదువుకునేటప్పుడు వస్తూండేవాడే-రాధాకృష్ణమూర్తిని."

"నాకు బాగా జ్ఞాపకం లేదు—అయితే నీకీ సంబంధం ఇష్టమేనా?"

"ఎందుకిష్టం కాదు?"

సరోజిని తనా విషయం మాట్లాడదలుచుకున్నది అయిపోయినట్టు సన్న గొంతుతో ఎదో మంగళహారతి ఎత్తి చప్పున ఆపి "ఇప్పుడీ సంబంధం కాకుండాపోతే!" అన్నది.

"ఏమిటి!"

"నిన్ను-ఆ అబ్బాయికిచ్చి-ఆయన పేరేమిటి?-ఆయన కిచ్చి చెయ్యరనుకో."

"పోని! అయినా ఎందుకు చెయ్యరు?"

"ఇంకొకరి కిచ్చి చేస్తే?"

"ఇంకో రెవరు?"

"అన్నయ్యకిస్తే!"

సావిత్రి నవ్వి "తాతయ్య కిష్టంలేదుగా!" అంది.

"తాతయ్య సంగతి కాదిప్పుడు నీ సంగతి చెప్పు."

"ఏమో! నా కంత యిష్టంలేదు సుమా. మామయ్య ఎప్పుడూ మేనకోడలిని చేసుకోటం నీతికాదంటుంటాడు. అయినా ఇప్పుడెందు కా ఆలోచన!"

సరోజిని సావిత్రి చెయ్యి తీసుకుని వేళ్ళు సాగదీస్తూ "ఇవాళ మా నాన్న మీ నాన్న నడగబోతున్నాడు నిన్ను అన్నయ్య కిమ్మని నీ కింకా తెలీదేమో!" అని సావిత్రి మొహంవంక చూసింది. సరోజిని అనుకున్నట్టు సావిత్రి మొహాన ఏ భావం కనపళ్ళేదు. ఇంత రహస్యం చెప్పినా సావిత్రి చలించకపోవటం చూసి సరోజినికి ఉత్సాహభంగ మైంది. ఇద్దరూ కొంతకాలం మౌనంగా కూర్చున్న తరువాత సరోజిని పోజాడుతూ లేచింది.

"కాస్సేపు కూర్చోవే అబ్బ! ఇంట్లో ఏముంది ?" అన్నది సావిత్రి.

"యింకా అడుగూ బొడుగూ కాఫీ ఉందేమో తాగి ఇప్పుడే వస్తా. లేకపోతే మంచినీళ్ళైనా తాగుతా, ఏం చేస్తాం ?" అంటూ చెయ్యివదలించుకుని సరోజిని ఇంటివైపు పరిగెత్తింది.

సరోజినటు వెళ్ళింది, సుందరం ఇటొచ్చాడు. అతను వెనకనించి సావిత్రిని సమీపించి "యిక్కడున్నావుటే అమ్మాయి ? అమ్మ నీకోసం వెతుకుతూంటేను. ఓసి ! నువ్వేటే ! కోడలా" అంటూ సావిత్రి పక్కనే కూలబడి ఒక చేత్తో సావిత్రిని దగ్గిరికి తీసుకున్నాడు.

"నీ పెళ్ళెప్పుడే పెళ్ళికూతురా ? రాధాయి కంట గడుతున్నారూ నిన్ను ? మంచి శెధవ! నీకు మంచి మొగుడవుతాను. అలుసుమాత్రం ఇచ్చేవు సుమా ! ఒక చెంప నించి తొక్కి పడితే కాని మాట వినడు. జాగ్రత్త."

"ఏమ్మాటలు మామయ్యా!"

"ఓసి! నీ కెంత సిగ్గే! ఒక్కత్తెవు కూర్చుని మొగుడి విషయం ఆలోచిస్తున్నావేమో నని మంచీ చెడ్డా అడిగితే తప్పా! నే పోతున్నా లే!"

"ఉండు, ఉండు!అలా అయితే నేనూ పెళ్ళివిషయమే మాటాడతాను. ఒకటి చెప్పు. మేనమామనును పెళ్ళి చేసుకో వచ్చునా?"

"తప్పు."

"నేను మరి నిన్ను చేసుకోబోతున్నానే!"

సుందరం సావిత్రి చెంపమీద ఒక్కటిపెట్టి "ఈసారి ఆ మాటంటే నీతో మాట్లాడను" అన్నాడు.

సావిత్రి చెంపరుద్దుకుంటూ నవ్వి "ఈ మాట మీ నాన్న అన్నా ఇదేనా శిక్ష?" అన్నది.

సుందరం ఆశ్చర్యంతో మేనకోడలి వంక చూసి, "నా కింకా తెలీదే! నీతో ఎవరన్నారు?" అని అడిగాడు.

"సరోజిని."

"దానికన్నీ తెలుసు!... హుఁ!ఆ అయిదువేల కట్నం నాన్నగారి మతి చెడగొడుతున్నది. స వత్సరం కిందట ఈ విషయం వచ్చినప్పుడు అయినవాళ్ళల్లో కట్నం రాదని చాతయిన వంకలన్నీ చెప్పి మనిద్దరికీ ముడి పడకుండా చేశాడు. ఈ సారి బావ ఎలా తప్పించుకుంటాడు ? యింకో వెయ్యి యిస్తామంటే సగోత్రీకుల పిల్లనైనా చేసుకుంటారు నాన్నగారు. ఒక్క పాఠం నేర్చుకో, పిల్లా ! నీ కెప్పటికైనా పిల్లలు పుడితే విశ్వప్రయత్నంచేసి వాళ్ళకు పెద్దవాళ్ళ నెదిరించటం నేర్పు. నా కిన్నేళ్లు వచ్చినై, ఇంత చదువు చదివాను. నాన్నగారు రేపు కొండముచ్చును పెళ్ళి చేసుకోమంటే కాదనేటందుకు నాకు ధైర్యంలేదు. మీ నాన్న నీకు చనువిచ్చాడుగా ! రాధాయినే చేసుకుంటా నని పోట్లాడు."

"నేను పోట్లాడను. నాన్న పెళ్ళివిషయం నన్నడగడు, నేను సిగ్గుపడతానని ఆయన నమ్మకం. నేను సిగ్గులేనట్టు ఆయనకెలా తెలియచెయ్యటం ?"

"అవును, ఏం లోకం!. ఎవరి పిల్లల మనసు వాళ్ళకు తెలీదు."

## 2

మర్నాడు సావిత్రి పెళ్ళికి ముహూర్తం ఏర్పాటు చేశారు. తాంబూలాలు పుచ్చుకున్నారు. ముహూర్తం ఇరవై రోజుల్లో వుంది.

ఆ సాయంకాలం సుందరం, రాధాకృష్ణమూర్తి కృష్ణ ఒడ్డున ఇసకలో కూర్చున్నారు.

"రాధా! నా పెళ్ళికి తప్పక రావాలిసుమా. చెల్లెలిని చేసుకుంటున్నవాడి పెళ్ళి నీ కెక్కడ తటస్థపడుతుంది!" అన్నాడు సుందరం దీనంగా.

"అర్థం లేకుండా మాట్లాడతావేంరా, సుందరం! అప్పగూతుర్ని చేసుకుంటున్నవాడివి నువ్వేనేం లోకంలో! నీకు మళ్ళీ అటువంటి పిల్ల వస్తుందీ?"

"అటువంటి పిల్ల మా సరోజాం ఒకతె వుందిగా!"

"ఛీ! అప్రాచ్యుడా! వాళ్ళిద్దరూ ఒకటిగా వుంటారనుకుంటున్నావుకాని, నక్కకూ - ఇద్దరికీ ఎంతో భేదం వుంది. నాకు సంబంధమే కనపడదు."

"ఇంకేం! నాకు భేదమే కనపడదు. నిన్నా ఇవాళ లోపల వందసార్లు సావిత్రిని సరోజని పేరుపెట్టి పిలిచాను. అది పలకదు!"

"సిగ్గు."

"నీ మొహం! దానికోపం, వళ్లుమంట, ఎందుకుండదు! చిత్రం చూడు. ప్రకృతి మనల్ని వెక్కిరించటానికిలాచేసింది కాని, వాళ్ళిద్దరిలో నీకు కనపడ్డ భేదం నాకు కనపడి నీ కా భేదం కనపడకుండా వుంటే ఎంత బాగుండేది! నేను సావిత్రిని కొంతవరకు నిశ్చింతగా పెళ్ళి చేసుకునేవాణ్ని. సరోజాం నీకు కుదిరేది."

ఇక్కడ రాధాకృష్ణమూర్తి ఊడుకు మించిన మాట అన్నాడు.

"ఎందుకు దిగులుపడతావురా? పెళ్ళయిన మరుక్షణంనించీ ప్రయత్నం చేసినా ఇద్దరికీ సంబంధం కనపడదు"

"నీ దయవల్ల అలా అయినా బాగుండును."

"నాన్నకోపం వచ్చింది మీా బావగారి మీాద."

'నిన్ను వదులుకున్నందుకా!"

"పెద్దకట్నం పోయిందే అని"

"సామెత చెప్పినట్టుంది."

పూర్తిగా పొద్దు కూకకుండానే ఇద్దరూ ఇంటిదారి పట్టారు. భైరవమూర్తిగారి మేడముందు రాధాకృష్ణమూర్తి గుడ్ నైటన్నాడు.

సుందరం రాధాకృష్ణమూర్తి చెయ్యి పట్టుకున్నాడు.

"ఒక కప్ కాఫీ తాగిన తరువాత."

"కాఫీ! అవశ్యం."

ఇద్దరూ మూలగదిలో చేరారు. సుందరం లోపలికి

వెళ్లాను, సరోజినితో రెండు కప్పులు కాఫీ తయారు చెయ్యమన్నాడు. అందుకని సరోజిని మూడు కప్పుల కాఫీ చేసి తనకో కప్పు దాచుకుని మిగిలిన కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. తరవాత కొంచం ఎడంగా నుంచుని రాధాకృష్ణమూర్తిని పరీక్ష చెయ్యటం మొదలుపెట్టింది.

రాధాకృష్ణమూర్తి కాఫీ కాస్త రుచి చూచి కప్పు బల్లమీద పెట్టి "ఫైన్" అన్నాడు.

సుందరంకూడా కొంచం తాగి మొహం చిట్లించి, "నాకు కాఫీ రుచి తెలీదురా ఖర్మం!" అన్నాడు.

"సావిత్రికీ అంతే అన్నయ్యా దానివన్నీ నీ గుణాలే" అన్నది సరోజిని నవ్వుతూ. రాధాకృష్ణమూర్తి కొంచంసేపు సరోజినివంక చూసి, తల గోక్కుని కాఫీ తాగటం సాగించాడు.

"ఈ కాఫీమాత్రం ఘుమాగా ఉందిరా. యమగా వుందనుకో! అద్భుతంగా వుందంటే నమ్ము. ఎందుకూ? కెంగరం అయ్యారు కాఫీకి నకలు. అసలుకు సరియయిన నకలు."

సరోజిని తల ఒక పక్కకు ఒరగేసి రాధాకృష్ణమూర్తిని చూస్తూ "పాపం, సావిత్రికి మంచి మొగుడయ్యేవాడు!" అనుకుంది.

"నేను పోతున్నాను. మీ కింకేం కావాలి?"

"నీళ్లు"-సుందరం.

"తాగటానికేనా!" రాధాకృష్ణమూర్తి.

"తప్పకుండా! లేకపోతే ఈ చేయి ఇలాగే వుండనీమంటావా ఏమిటి?"

సరోజిని బిగ్గరిగా నవ్వుతూ పరిగెత్తిపోయింది.

రెండు నిమిషాలపాటు స్నేహితులిద్దరూ మౌనంగా కూర్చున్నారు. చివరకు రాధాకృష్ణమూర్తికి మాట్లాడ బుద్ధయింది.

"మీ చెల్లెలికి మీ మేనకోడలికీ భేదం లేదంటావేంరా, సుందరం?"

"ఆఁ?" అన్నాడు సుందరం పరధ్యానంగా.

"ఇద్దరికీ లక్ష భేదం వుంది."

"ఎవరు?"

"మీ చెల్లెలికీ. మీ మీ సావిత్రికీ-

"ఏమిటి?"

"భేదం-లక్ష భేదం-"

'ఏం భేదం?'

'వుంది.'

'ఎందుకుంది.'

'ఎందుకు లేదు'

ఇప్పుడు సుందరం దోవకొచ్చాడు.

'నా ఆలోచనంతా పాడుచేశావు! ఏమిట్రా నువ్వు మాట్లాడుతున్నది?'

రాధాకృష్ణమూర్తి మళ్ళీ వెనక్కు రాదలుచుకో లేదు.

'సావిత్రి ఇంత ఉత్సాహంగా వుండదు.'

స్నేహితుడేం మాట్లాడుతున్నాడో తెలీక సుందరం 'ఆఁ?' అన్నాడు.

'ఇంత మాట్లాడదు.'

'ఎవరు ?'

'సావిత్రి.'

'సావిత్రంటే ! ఓహో సావిత్రా? ఇంకా సావిత్రేమో ననుకున్నా!'

'ఇంత నవ్వదసలు.'

'ఎవరు? సావిత్రేనా?'

'ఆ! అంటే సావిత్రి కాదు? సావిత్రి !'

'సావిత్రి నవ్వదా?'

'నవ్వదు.'

'ఎందుకు నవ్వాలి ? నవ్వు నాలుగందాల చేటు.'

రాధాకృష్ణమూర్తి తల గోక్కుని అకస్మాత్తుగా లేచి 'గుడ్ నైట్' అని వెళ్ళిపోయినాడు.

## 3

జరిగిన సంగతేమిటంటే రాధాకృష్ణమూర్తి మొదట సావిత్రికోసం ఉబలాట పడ్డప్పుడు తన మనస్సును ఆ పిల్ల కర్పించుకున్నాడు. ఒక పిల్ల తన అనుజ్ఞ లేకుండా తన మనసును ఎత్తుకుపోవటం అతనికి కొత్త అనుభవం. అనుభవం లేనివాడు కనకనే పనిపెట్టుకొచ్చి సరోజిని తన మనస్సు ఆకర్షి

స్తుంటే చూస్తూ వూరుకున్నాడు. దానికి అతనికివ్వబడ్డ శిక్షేమిటంటే సరోజిని!

రాధాకృష్ణమూర్తి మాట్లాడుతున్నది వినిపించుకోకుండా సుందరం ఆలోచిస్తున్న దేమిటంటే తన చెల్లెలికీ సావిత్రికీ ఏం సంబంధం వుందా అని. దానికా్కరణం ఉంది. అతను సావిత్రిని సరిగా చూసింది కిందటిరోజుదయం, చెల్లెలిని సరిగా చూసిం దంతకు పూర్వమే ! మగవాడికి పెళ్లియావ లేనంతకాలం ఆడపిల్లలంతా ఒకటిగానే ఉంటారు. వాళ్ళిద్దరికీ కొంత పోలికకూడా వుంటే చెప్పేదేమిటి?

అన్నిటికన్న ముఖ్యమైన విషయం మొదటినించీ సావిత్రికి దగులు తన్ను తన మూను కియ్యరనే.